# విశాల హృదయం

వాకిట్లో వేపచెట్టు క్రింద నులక మంచం వేసుకుని పేపరు చూసుకుంటూ కూర్చున్నాడు, గోపాలరావు. రైలు పెట్టెల్లో రకరకాల మనుష్యులు కలిసినట్టే పేపర్లో ఎక్కడెక్కడి విషయాలో సంబంధం లేక పోయినా వకదాని పక్క వకటి కూర్చివుంటాయి. గోపాలరావుకి పేపరు చూస్తుంటే సినిమా చూస్తున్నట్లు వుంది.

రైలు కిందపడి ఎవరో ఆత్మ హత్య చేసుకున్నారుట. పాపం; ఇంట్లో ఈగల మోత వుండి వుంటుంది. బయట అప్పుల వాళ్ళ అరుపులు వినబడి వుంటాయి. పెళ్లానికి పురిటి రోజులు. చంటివాడికి చలిజ్వరం. యింట్లో ముసలమ్మకు రోజులు నిండుకుంటున్నాయి. బియ్యం డబ్బా ఖాళీ అయింది. దుకాణంలో అరువు యివ్వనన్నాడు. అంతకంటే ఏం కావాలి. రైలుకింద ఎందుకు పడ్డాడో. బహుశా పురిపెట్టుకోవడానికి సరిపోయేతాడు యింట్లో లేదేమో!....

చెత్త కుండీలో పసి పిల్లవాడు దొరికిన వైనం, అభాగ్యురాలు ఎవరో, పసి పాపను పోషించుకునే తాహతు లేదేమో? పేదరికం మన దేశాన్ని పీల్చి పిప్పి చేస్తోంది. ఆమెకే కనక పది ఎకరాల మాగాణి భూమివుండి, ఆమె భర్తకే గనక రెండు వందల రూపాయలు సంపాదించే వుద్యోగమే వుండి వుంటే యింత ఘోరం జరిగేది గాదు. అయినా పిల్లలు లేని తల్లులు ఈ భూమిమీద యింత మంది తల్లడిలుతుంటే ఆ పసి కందును ఏ ఆసుపత్రికో నన్నా యిచ్చేస్తే ఎంత బాగుండేది?... యింకొక విషయం గూడా అయివుంటుంది పేదతనం వల్ల అనుకోటానికి తగినంత ఆధారం కనపడదు. గొప్పవాళ్ళ యిళ్ళల్లో జరిగే ఘోరాల ఫలితమేమో! ఆ మధ్య ఫస్టు క్లాసు పెట్టెలో నుంచి దిండు లాంటి వస్తువు రైలు పోతుండగా కింద పడిపోతే గొలుసు లాగి కిందకు దిగి చూశారు రైల్వే గార్డు మొదలయిన వాళ్లు. పీక పిసికేసి ఎవరో మహాతల్లి పసి కందును గుడ్డలో చుట్టి విసిరేసిందని తెలిసింది. అది ఆమె అభిమానం తాలూకు పరిణామమట. గార్డు చేతిలో వంద

రూపాయల నోటుపెట్టి తన ప్రతిష్ట కాపాడుకుందిట. ప్రతిష్ట బయట వాళ్లు కాపాడేదా. యెవరికి వారు కాపాడుకో వలసిందా? ఏమిటో ఈ ప్రపంచం వినాశానికి బయలుదేరి పోతోంది.

ఒక సామ్యవాద సిద్ధాంతి ఆవేశంలో పని మనిషిని చావ కొట్టి, ఉద్రేకం చల్లారిన తర్వాత తీరికగా జైల్లో మకాం పెట్టాడుట: యిదీ బాగానేవుంది. చెప్పే పన్నీ చెయ్యాలని యెక్కడవుంది! చెయ్య గలిగిన విషయాలన్నీ మళ్ళీ చెప్పటమెందుకు. పని మనుషులు గూడా నిజంగా మనుష్యులేననీ, వాళ్ళలోగూడా రక్తం మాంసాలుంటాయని ఆయన ప్లాటుఫారం మీద వకసారి బల్ల విరగ్గొట్టాడుట. రక్త మాంసాలు వుండవని ఎవరు అనుకుంటారు గనక. ఎవరో యికిలిస్తే ఆయన గారు అయాసపడి కూచున్నారుట...

గోపాలరావు పేపరు పేజీ తిప్పాడు. యెవరో అడుక్కు తినే వాడు గేటు గొళ్ళెం తీసుకుని లోపలకు ప్రవేశించి, స్తంభాని కానుకుని చేతిలోవున్న డబ్బాను నిర్లక్ష్యంగా ముందుకుచాచి "మిమ్మల్నే" అన్నట్టు గోపాలరావు వంక వురిమి చూశాడు. గోపాలరావు కొద్దిగా జంకాడు తనింట్లో వక్కడే వున్నాడు గదా అని. వచ్చినవాడు చూస్తే కండలుతేలి, నరాలు ఇనప తీగెల్లాగా బయటికే కనపడు తున్నాయి. తనంటే చొక్కా వేసుకున్నాడు కాబట్టి సరిపోయింది గాని ఎవరయినా సరే, ఆవలించక పోయినా పేగులెన్ని ఉన్నాయో అతి సులభంగా లెక్క పెట్టగల స్థితిలో వుంటాడు.

"ఏయ్...అట్లా చూస్తావెందుకు...." అన్నాడు.

"ఇంకా ఎట్లాచూడాలి?"అన్నట్లు ముఖం పెట్టాడు ఆగంతకుడు.

"మొద్దులాగా వున్నావు...ఏదయినా పని చేసుకోరాదూ...." అందరు పెద్ద మనుష్యులు అడిగే ప్రశ్నే అడిగాడు.

"ఏం...ఎందుకు చేసుకోవాలి...." అన్నాడు అడుక్కు తినే వాడు. వాడి కులం అది. అంతే...గోపాలరావు కాలరు సర్దుకున్నాడు.

"పని చేసుకోకపోతే ఎట్లా గడుస్తుంది."

'తమరికి గడవటంలా—'

గోపాలరావు యింట్లో యినప్పెట్టె, బ్యాంకు ఎకౌంటు, చెక్కు పుస్తకం అన్నీ గుర్తుకు వచ్చాయి.

"రెండు రూపాయ లివ్వండి....మళ్ళీ నేను వెళ్ళాలి" అన్నాడు అడుక్కు తినేవాడు. గోపాలరావు గుండె నోట్లోకి వచ్చింది.

"ఈ కాని తీసుకునిపో...." జేబులో నుంచి కానీ తీసి గిరాటు వేశాడు. ఆగంతకుడు పడిపోయిన కానివంక చూడనేలేదు. చొక్కా పై కెత్తి బొడ్డులోనుంచి చాకు తీశాడు.

"పైస లిప్పించండి...పోవాలి...." అన్నాడు. గోపాలరావు కంగారుగా పర్సు తీశాడు. అయిదు రూపాయల నోటు మాత్రంవుంది.

"చిల్లరలేదు...." అన్నాడు. గొంతుకు ఆర్చుకొని పోయింది.

"ఫరవాలేదు...." అన్నాడు ఆగంతుకుడు చాకును బొడ్డులో దోపుకుని అయిదు రూపాయల నోటు అందుకుని "జాగ్రత్త" అన్నట్టు చూస్తూ వెళ్ళిపోయాడు.

గోపాలరావు ప్రాణం నీళ్ళు కారి పోయింది. పోలీసులకి రిపోర్టు యిద్దా మనుకున్నాడు. ఖూనీ ఎందుకయిందో, ఎలా అయిందో ఆరా తీయగలరుగాని. అసలు హత్య జరగకుండా ఎట్లా, ఎంత కాల మని కాపాడ గలరు? ప్రాణం మీద తీపి, అయిదు రూపాయల కాగితం, తన అభిమానం మీద వుండే తీపి కంటె ఎక్కువగా తోచింది. కళ్ళు తుడుచుకొని పేపరు మళ్ళీ చూడటం మొదలు పెట్టాడు.

పట్టపగలు దొంగతనం....యింటి యజమానికి గాయాలు... గోపాలరావు మనుస్సు చివుక్కుమంది. పేజీలు తిప్పేశాడు. అన్ని చోట్లా యిటువంటి అన్యాయాలు జరుగుతూ వుంటాయన్నమాట. అరి కట్టడం ఎలాగూ అని. ఇందాక వచ్చినవాడికి తన మాగాణీ పొలంలో సగ భాగం యిచ్చేసి వ్యవసాయం చేసుకోమంటే తనింటికి కత్తి తీసుకుని వచ్చేవాడేనా! అయినా ఎంతమందికి యిలా భాగం పంచి యిచ్చి తను బికారి కాగలుగుతాడు.

ఈ సారి యింకొకడు వచ్చాడు. అస్థిపంజరం నడిచి వస్తు న్నట్లుంది. గేటు అవతలనుంచే అరుస్తున్నాడు. గోపాలరావు యిందాక

గిరవాటు వేసిన కానీ వెతికి వాడికి తీసుకుపోయి యిచ్చాడు. వాడికి కానీ వద్దుట. తింటానికి ఏదన్నా కావాలంటున్నాడు. చలివేస్తున్నది కాబట్టి పాత చొక్కా ఏదన్నా యిప్పించ మన్నాడు. కానీ కంటే యింకా ఏమీ యివ్వదలుచుకో లేదని ఖచ్చితంగా చెప్పేశాడు గోపాలరావు. వచ్చినవాడు అన్నం పెట్టకపోతే అక్కడే చచ్చిపోతానన్నాడు. గోపాలరావు విజృంభించాడు. పేపరు మంచం మీద విసిరేసి ఆ ఎముకల గూడు మెడ ఎముక పట్టుకొని సందుచివర దాకా గెంటి వచ్చాడు.

పేపరు మీద విసుగుపుట్టింది గోపాలరావుకు. విసిరి నేలకేసి కొట్టాడు. వెనకాల వైపున పెద్ద హెడ్డింగు. జపానులో వ్యభిచార నిర్మూలనకు ప్రభుత్వ చర్యలు. ప్రజలు చర్య తీసుకోవాలి గాని ప్రభుత్వం రూలు పెడితే ఏమవుతుంది గనక. అసలు ఆ వృత్తి మాన్పించాలని, అటువంటి వాళ్ళందరికి జీవనోపాధి కల్పించాలని తను చాలా కాలం నుంచి అనుకుంటున్నాడు. ఏ రకమయిన జీవనోపాధి కలిగించాలి అను విషయం మీద అతనికి చాలా అభిప్రాయాలున్నాయి. అవన్నీ గుర్తు తెచ్చుకుందా మనుకున్నాడు. బుర్ర వేడెక్కబోతుండగానే మళ్ళీ ఎవరో బిచ్చగత్తె వక రెండేళ్ల చంటివాడిని చంకలో వేసుకుని దణ్ణాలు పెట్టుకుంటూ వచ్చింది.

బహుశా పాతికేళ్ళు వుండివుంటాయి. వేషం అవకరంగావున్నా ఆకారం బాగానేవుంది. అందానికి కావాల్సిన వస్తువులు గానీ, కళ్ళు ముక్కు వగైరాల కొలతలు గానీ స్టాండర్డు కొలతలు కాకపోయినా చూడటానికి పొందిక గానే వుంటాయి. ఆమెను చూస్తే జాలి కలిగింది. తన వంటి భాగ్యవంతుడు పెళ్ళి చేసుకుని వుంటే ఈ రోడ్ల వెంబడి తిరిగే కర్మ పట్టేదేనా!

ఛీ! అనుకున్నాడు. తనకు చేతనయిన సాయంచేసి పంపిద్దామనిపించింది. మనీ పర్సు తీసి చూశాడు. చిల్లరలేదు. పది రూపాయల కాగితం వక్కటిమాత్రం వుంది. బిచ్చగత్తె అతని వంకచూస్తూ నిలబడింది. కత్తి తీస్తుందేమోనని భయంవేసింది. అంతకంటె వాడిగా

పున్నాయి ఆమె చూపులు. పది రూపాయల కాగితంతీసి "ఇది తీసుకో" అన్నాడు.

బిచ్చగత్తె నవ్వింది. ఏమిటో అర్థం చేసుకున్నట్లు తల ఆడించింది. చిరునవ్వు ముఖంతో కాగితం అందుకుని అతనివంక సూటిగా చూస్తూ యింటిలోపలి వైపుకు వయ్యారంగా అడుగులు వేసింది. అతనిలో పశుత్వం తొంగిచూచింది. చకచకా ఆమెవైపు అడుగులు వేసి 'లోపలకి పద' అన్నట్లు చెయ్యి చూపించాడు. ఆమె అడుగులు వేసింది. అతను వెనకాల నడుస్తున్నాడు. ఆమె చేతిలో పాప అతని వంకచూసి నవ్వింది. ఆ పాపలో అతని ప్రతిబింబం కనపడింది. అతని మీద తేళ్లూ, జెర్రులూ ప్రాకి నట్లయింది.

పక్కసారిగా ఆమె చెయ్యి పట్టుకుని జరజర గేటుదాకా లాక్కుపోయి "పో అవతలకి, మళ్ళీ ఎప్పుడూ ఇక్కడ అడుగు పెట్టక" అంటూ బిగ్గరగా గదమాయించాడు.

పేపరు తీసి, నులక మంచం ఎత్తేసి యింట్లోకి పోయి తలుపు బిడాయించాడు. ఏదైనా పుస్తకం తీసి మనశ్శాంతి చేకూర్చుకుందా మనుకున్నాడు. అలమారులో అతనిచేతికి "అసమర్థుని జీవితయాత్ర" దొరికింది.

★